బతుకును నిలబెట్టే బతుకమ్మకు సైతం పరిమితులుండటం నన్ను కలవరపెట్టింది. పై కులాలకే పరిమితమయిన ఈ బతుకమ్మ పీడిత కులాల బతుకమ్మగా రూపొందాలని చెప్పడానికి చేసిన ప్రయత్నం.

పి. చిన్నయ్య

# 11 అంటరాని బతుకమ్మ





"అందరూ తెలిసినోళ్లే గదానుకుంటి, మనసుల ఇంత విషం ఉంటదనుకుంటె బతుకమ్మ చేసేదాన్నేగాదు..." కడుపుల్నుండి తన్నుకొస్తున్న బాధనాపుకుంటూ నా పళ్లెంల కోడికూర ఏస్తూ అంది పద్మ. వాళ్లాయన నరేష్, దుర్గయ్య, నేను పక్కపక్కల కూసుని తింటున్నం.

"నేను చెబుతనె ఉంటి ఈ పండుగ మనదిగాదని. చేసుకుంటె చేసుకుంటివి. పోయి మన కులపోళ్ల దగ్గరాడనుంటివి. గా సూదరోళ్ల దగ్గరెందుకు పోయినవు?" అన్నడు నరేష్.

"గిట్లయిదతనుకున్ననా?" గుర్రున చూసింది పద్మ.

"గాకుంటె ఏమైతది? ఏమన్న ఇప్లవం వచ్చిందనుకుంటున్నవా. అంతా మారిపోయి పై కులపోళ్లతో ఆడెతందుకు?" కాస్త కోపంగా అన్నడు నరేష్.

నరేష్‌ను వారించిన. రాత్రంత నిద్రలేమితో గడిచినట్టుంది ఇద్దరికీ. ఇంతగనం చెప్పినా పద్మకర్థం కావటంలేదని నరేష్ కోపం.

పద్మను ఎట్ల ఓదార్చాలో నాకూ అర్థంకావటం లేదు. ఇటువంటి సంఘటనలు కొత్త గాకపోయినా పద్మకు కొత్తే. నిన్న రాత్రే జరిగిందంత ఫోన్‌జేసి చెప్పిండు నరేష్. రాత్రంత దీని గురించె ఆలోచనల పడ్డట్టయింది నాకు.

దసరా పండుగ దినం. ఇల్లంతా కలకలలాడాల్సింది పోయి బిక్కముఖం ఏసినట్టయింది. వాతావరణాన్ని తేలిక చేయటానికన్నట్టు, "ఏంది చెల్లే, కోడి ముక్కలె ఏస్తున్నవు. పెద్ద కూర (గొడ్డు మాంసం) తేలేదా నరేష్ బావ!" అన్నడు దుర్గయ్య.

"తెచ్చిండు. నేనె వండలె. ఆయన్నె వండుకొని తినమన్న," అంది ఉక్రోషంగా.

"ఎంతయిన చెప్పు చెల్లె. ఆ కూర మీదకు ఈ చికెనేమొస్తది? మధ్యాహ్నం గౌస్‌మియా వస్తనండు. బిర్యానీ వండుతం తీయి..."

ఇంకో సమయములైతె దుర్గయ్యతో వాదనకు దిగేది. కాని ఇప్పుడు వేటినీ పట్టించుకునే స్థితిల లేదు పద్మ.

నిన్న జరిగిన సంఘటనతో పూర్తిగ ఆత్మరక్షణల పడ్డట్టయింది. దాన్ని తలచు కుంటెనే తలలో నరాలు చిట్లినంత బాధ. ఎవరో తెలియనోళ్లయితే పట్టించుకునేది గాదు. అంతా తన సుట్టుపక్కలోల్లె. చెల్లె, అక్కా, ఒదినా అన్నోళ్లే. కనీసం గొల్లోల్ల సరిత, సాకలోల్ల లక్ష్మి, 'ఏమైతది ఆడితే,' అని తనవైపు మాట్లాడకపోతిరి. అదే మింగుడుపడటం లేదనుకుంటూ పద్మకు.

పద్మ ఈ వూర్లనే గ్రామీణ బ్యాంకుల బ్యాంక్ మిత్రగా పనిచేస్తుంది. మహిళా సంఘాలకు లోన్ ఇప్పించటం, తిరిగి కట్టించటం, వాటికవసరమైన ఓచర్లు రాయటం, సలహాలివ్వటం చేస్తుంది. దాంతో ఊర్ల మహిళలంత బాగా పరిచయం. పైగా అందరితో కలగోలుపుగా కలుపుకొనిపోతది. అందరు తనను మంచిగనే గౌరవిస్తున్నట్టనిపించేది పద్మకు.

కాని నిన్నటి అవమానం సమస్త నమ్మకాల్ని కోల్పోయేటట్టు చేసింది. ఇది వరకు నరేష్ కులాల గురించి వాదనకు దిగినప్పుల్లా కొట్టిపారేసేది. ఈ కాలంలో వాటిని ఎవరు పట్టించుకుంటున్నరనేది. మనం మంచిగుంటే అందరు మనతో మంచి గుంటరని వాదించేది.

“కొద్దిగా కూర ఏసుకోన్నా,” నా పళ్లెంలో కూర వేయబోయింది పద్మ.

“వద్దులేరా, సల్లున్నాదా?” అన్న.

“రాజరెడ్డన్నకు ఏదున్న లేకపోయిన సల్లో పులుసో ఉంటే సాలు. మా ఇంట్ల కూడ గవే పోసుకుని తింటడు,” కూర ఏసుకుంట అన్నడు దుర్గయ్య.

“కాదన్న. మీటింగులపుడు ఊరు ఊరున గౌరమ్మలు చేసి, బోనాలు పెట్టి అన్ని కులపోళ్లు ఒక దగ్గర కలిసి ఆడినపుడు కులమంటు లేదుగాని, నిన్న సద్దుల బతుకమ్మ రోజున వాళ్లతో ఆడితె తేడాలొచ్చినయా?” నా పళ్లెంల సల్ల పోస్తూ అంది పద్మ.

“అన్ననడిగితె ఏమి చెబుతడు? డబ్బులిచ్చి బతుకమ్మలాడిచ్చి బోనాలెత్తిం చిన పార్టీలను, జాగృతోళ్ల నడుగు ఏం చెబుతరో చూద్దం,” అన్నాడు నరేష్ ఎక సెక్కెంగా.

“ఎవర్నడుగుతది చెల్లె. ఆ నాయకురాలికి విదేశాల్లో బతుకమ్మలాడటమే సరిపోయె. మన వాడలకొచ్చె తీరికేది? అయినా వాళ్లకు గావల్సిన తెలంగాణ వాళ్లకొచ్చె...” కట్టె ఇరిచినట్టు మాట్లాడుట అలవాటె దుర్గయ్యకు.

నిజమే, ఉద్యమ సమయంలో బతుకమ్మలను బోనాలను మంచికో, చెడుకో వాడుకున్నరు. మీటింగులకు, బతుకమ్మల ప్రదర్శనకు పద్మ, సరిత, లక్ష్మి లాంటోళ్లకు డబ్బులిచ్చి బతుకమ్మలు తయారు చేయించినరు. ఆడించినరు. బోనాలు ఎత్తించినరు. అప్పుడు కులమంటు లేదు. కులాలడ్డు రాలేదు.

పద్మ మొండితనం ఏంటో ఆమె చిన్నప్పటి సంది చూస్తున్నదే. ఏదన్న పట్టిందంటె ఒదలదు. స్కూల్ల ఆటల్లో పాటల్లో మగపిల్లలతో సమానంగ పోటీపడేది. ఆ కాలంలో విప్లవ పాటలతో మారుమోగుతుండేది ఆ ప్రాంతమంత. పద్మ అద్భుతంగా పాడేది. స్కూల్లో, ఊర్లో ఏ సాంస్కృతిక కార్యక్రమం జరిగిన ఈమె గొంతు మోగాల్సిందె. తర్వాత తెలంగాణ పార్టీలకు ఈమె గొంతు కావల్సి వచ్చింది. వాళ్లతో ఎట్ల ఉండాలో పద్మకు తొలినుంచి జాగ్రత్తలు చెబుతనె ఉండేవాడు నరేష్.

‘‘అసలు ఎట్ల జరిగిందో చెప్పు చెల్లె?’’ నిన్న జరిగిన విషయం గురించి అడిగిండు దుర్గయ్య.

అసలె సైనస్ మనిషి. రాత్రంత భార్యాభర్తల మధ్య జరిగిన సంవాదం, నిద్రలేమి, ఆందోళనతో ఆమె ముఖమంత ఎరుపెక్కింది. నెమ్మదిగా చెప్పటం మొదలుపెట్టింది పద్మ.

‘‘... నరేష్ చెబుతనె ఉండె, లేంది పోంది ఎందుకు పెట్టుకుంటవని. నేనె వినలె. మీటింగులకు బతుకమ్మలు చేసుడలవాటయ్యె. పాణమాగలేక మా పెద్ద బావకొడుకును పువ్వులు తెమ్మంటె తంగేడు, గునుగు తెచ్చిండు. ఇంట్ల కాగితప్పూలుండె. వాటిని కలిపి బతుకమ్మను పేర్చిన. మీటింగులకు పోయిపోయి కులపోళ్లతోనె ఆడాలనె సోయి లేకుండె. అయినా మా కులపోళ్లు రెండు బజార్లవతలుంటిరి. మీటింగులకు బతుకమ్మలను మా ఇంట్లనె పేరుస్తుంటిమి. సరిత, లక్ష్మి గూడ బతుకమ్మను ఎట్ల పేర్చాలో మా ఇంట్లనె నేర్చుకున్నరు. ఆ సోపతితోనె సరిత దగ్గరకు పోయి నిన్న పొద్దునె చెప్పిన నేను గూడ వాళ్లతో వస్తనని. నా మాటలకు వాల్లేమి మాట్లాడలేదు. నాకప్పుడు అర్థంగాలె.

‘‘సాయంత్రం బతుకమ్మలను తీసుకొని ఊరి మధ్యకు పోవాలంటే ఈ వాడ కట్టోల్లందరూ మా ఇంటి ముందు నుండె పోవాలి. పోయేముందు సరిత, లక్ష్మి చెబుతరు తీయనుకున్న. ఆడికీ ఆళ్లింటి ఒకట్రెండుసార్లు పోయొచ్చిన. వాల్లు ఉల్కుతలేరు పల్కుతలేరు. సరిత వాళ్లత్త గొణుగుతుంది ఎందుకో. పండుగ సందట్లో నేను గూడ పట్టించుకోలె.

‘‘అప్పుడప్పుడె చీకట్లు కమ్ముకుంటున్నయి. నరేష్ కంపెని నుండి రాలె ఇంకా. పిల్లలు పెద్దబావింటికి పోయినరు. ఇంటికి తాళం వేసి బతుకమ్మను ఎత్తుకొని

బయటకొచ్చిన. వాడకట్టోళ్లు ఒకర్ని చూసి ఒకరు బతుకమ్మలెత్తుతున్నరు. సరిత వాళ్లింటి వైపు నడిచిన. ఇంట్ల చూస్తె ఎవరు లేరు. 'ఇగో ఇపుడే పోయినరు,' ఎవరో ఎనకగుండి అన్నరు. గబగబా నడుచుకుంట గుంపు దగ్గరకు చేరుకున్న. అందరు ఊరి మధ్యకు చేరుకున్నం. ఎప్పటిలాగే అడ్డలల్ల వాళ్లు బతుకమ్మలను దించు తున్నరు. అప్పటికే కోమటోళ్లు, కాపోళ్లు ఓ అడ్డ దగ్గర బతుకమ్మ ఆడటానికి సిద్ధంగ ఉన్నరు. నేను పోయి సరిత, లక్ష్మి బతుకమ్మల పక్కనే దించబోయిన. పక్కనే ఉన్న సరిత వాళ్లత్త, 'ఏంది పిల్ల ఈడ దించుతున్నవు?' అన్నది.

'ఏందత్త అట్లంటున్నవు, ఆడెతందుకు!'

'మీ వాళ్ల దగ్గరకు పోయి ఆడు.'

'ఈడ ఆడితే తప్పేంది అత్తా?'

'తప్పుగాదా! ఎప్పుడు లేంది ఊర్ల కొత్త పద్ధతి తీసుకొస్తున్నవు. కులమాచారా లుండొద్దా? సిరి నీకుంటే మా వుండొచ్చుగాని, నీ దగ్గరే పెట్టుకో.'

"ఆ మాటలతో నోట మాట రాకుండయింది. తల గిర్రున తిరిగినట్టయింది. నెత్తి మీది బతుకమ్మను అట్లనే నేలగ్గొట్టి పోదామనిపించింది. ఇంతలో సరిత దగ్గరికొచ్చి, 'ప్లీజు పద్మ, నీవు ఈడ బతుకమ్మను పెడితే వీళ్లు ఆడరు. పోయి మీ కులపోళ్ల దగ్గర ఆడు,' నెమ్మదిగ బతిమిలాడుతున్నట్టు బాధతో అంది.

"నెత్తిన పిడుగు పడ్డట్టయింది. సరిత గూడ ఇట్లనుడేంది? లేసిందగ్గర్నించి ఇంట్లకొచ్చి కష్టసుఖాలు చెప్పుకునెటోళ్లు. తిని పోయెటోళ్లు. కూరలు ఏసుకపోయె టోళ్లు...

"తల మొద్దుబారినట్లయింది. అందరు నావైపె చూస్తున్నరు. సిగ్గుతో నెమ్మది గా కులపోళ్ల అడ్డ దగ్గరకు పోయిన. ఎట్ల ఆడిన్నో, పాడిన్నో, అందరికంటే ముందు చెర్ల పడేసి వచ్చిన..." పద్మ ముఖం మరింత ఎర్రగా మారింది.

"నీ మంకు నీదేనాయె. చెబితే ఇంటవా? పై కులపోళ్లు నిన్ను ఎట్ల కలుపు కుంటరనుకున్నవు? పిచ్చిదానివి కాకుంటె," ఈ మాట అని, ఎవరో పిలవడంతో బయటకు పోయిండు నరేష్.

తిరిగి లోపలికొచ్చి బీరువాలో పెట్టిన క్వార్టర్ మందు బాటిల్ తీసి బయట ఇచ్చొచ్చిండు.

"పండగొస్తే చాలన్న... పాలోళ్లతో గొడవ. మందు పోపియ్యకుంటే తిడుతరు. ఆ భయంతోనె నిన్న గుట్టలో పట్టుకొచ్చిన," నా పక్కన కూర్చుంటు అన్నడు నరేష్.

"ఓ పెగ్గేస్తవా?" దుర్గయ్య నుద్దేశించి అన్నడు.

"అమ్మో వద్దన్నా..."

"పండుగేగా!"

"మరిచిపోయిందాన్ని మళ్లా అలవాటు చేసుకొనుడెందుకు?"

"గట్టిగానె నిలబడిండు దుర్గన్న!" నవ్వుతు అన్నడు నరేష్.

దీనికో కారణముంది. దుర్గయ్య పదో తరగతి తప్పినంక బండకొట్టె పనిల పడ్డడు. దుర్గయ్య ఒక్కడేగాదు, కులపోళ్లంత బండ కష్టాన్ని మరిచెటందుకు మందుకు అలవాటుపడతరు. మామూలుగా తాగితే బాగె. కాని నాటుసారాకు బానిసగా మారిండు. ఆ సమయంలోనె ఉద్యమం పరిచయమయింది. తాగుడు మాన్పించ టానికి అన్ని ప్రయత్నాలు చేసిండు. ఫలితంగా సారా మరిచిపోయి కల్లుకు మాత్రం పరిమితమైండు.

"ఇంట్లకు మందు తీసుకరావద్దని ఎంత ప్రయత్నించిన తప్పటం లేదన్న," తప్పు చేసినవాడిలా అన్నడు నరేష్.

"ఒక్కసారిగ ఏదీ మారదు. ఓపికతో మార్చుకోవల్సిందే," అని నేనన్ననో లేదో-

"కాదన్న, ఈ పండుగకు అన్ని కులపోళ్లు కలిసి ఆడెటట్టు చేయలేరా?" పద్మ అందుకుంది.

"దీన్ని మార్చుడంటె అంత సులబమనుకుంటున్నవా ఏంది?" అన్నాడు నరేష్.

'ఎన్ని మారిపోట్లె... ఇదో లెక్కా," అంది పద్మ.

"మొండి వాదన సేయకు. తెలంగాణ వచ్చినంత సులబంగాదు దీన్ని మార్చు డంటె."

"గదే ఎట్ల మారుతదో చెప్పు? ఏమన్నంటే ఆ విప్లవం, ఈ విప్లవం రావా లంటవు. అసలు సాంస్కృతిక విప్లవం అంటే ఏందన్న?" చివరికి పంచాయితి నా దగ్గరకొచ్చింది.

ఇద్దరి మొండితనం తెలుసు నాకు. ఈ ఇద్దరు మొండోళ్లు ఎట్ల ప్రేమించి పెండ్లి చేసుకున్నరో ఆలోచిస్తే ఆశ్చర్యమనిపిస్తది!

వాళ్ల పెండ్లికి కొన్ని నెలల ముందు ఉద్యమం నుండి బయటకు వచ్చుంటి. తన కూతురును నరేష్‌కిచ్చి పెండ్లి చేయటం పద్మ తండ్రి కిష్టం లేకుండె. ఒక్కగానొక్క కూతురు. అంతకంటె అడ్డంకి నరేష్ ఒకటి రెండుసార్లు సానుభూతిపరుడనె పేరుతో బైండోవర్ చేయించబడ్డాడు. నరేష్‌కు, పద్మ తండ్రికి దూరపు బంధుత్వముంది. ఉద్యమావసరాల రీత్యా ఊరికి వచ్చి పోతుండటం, పద్మ కాలేజీకి పోతున్న సమయం లో వాళ్ల పరిచయం ప్రేమగా మారింది.

పద్మ తండ్రి నాకు కూడ బాగా పరిచయమె. ఉద్యమంలో భాగంగా చాలా సార్లు అతని దగ్గరకు పోయినవాన్నె. ఆ చనువుతోనె నా దగ్గరకొచ్చి-

‘‘బిడ్డా, పద్మ ఎంత చెప్పిన ఇనటం లేదు. వాన్నె పెండ్లి చేసుకుంటనని మంకుపట్టు పట్టింది,’’ అన్నడు.

‘‘మంచిదేగా ఇవ్వరాదు?’’ అన్న నేను.

‘‘ఏంది బిడ్డా అట్లంటున్నవు? అంతా తెల్సినోనివి. ఎట్టియ్యాలి చెప్పు?’’

‘‘నరేష్‌కిస్తే నష్టమేంటి? కంపెనీల పని చేస్తుండు. పద్మను మంచిగనే సాకుతడు.’’

‘‘అదిగాదు లోపలికి పోతడేమోనని,’’ తన అనుమానాన్ని, భయాన్ని బయట పెట్టిండు.

నాది, నరేష్‌ది, పద్మ తండ్రిది పక్కపక్క గ్రామాలే. నరేష్‌తో పదేండ్ల స్నేహం కాబట్టి గట్టిగానె చెప్పా.

‘‘ఉద్యమంలోకి ఏం పోడు. పెండ్లి చేయి...’’

‘‘కాదు బిడ్డ, పెండ్లయ్యాక...’’

‘‘నీవేమి బయపడొద్దు. వాళ్లిద్దరు నా దగ్గరకొచ్చినరు. అన్ని మాట్లాడిన వాళ్లతో...’’

ఇంత వాదనయ్యాక చివరికి వెళ్లిపోతు అన్నడు పద్మ తండ్రి-

‘‘నీ ధైర్యంతో ఒప్పుకుంటున్న. ఏదన్న జరిగితె నీదే బాధ్యత,’’ కోపంతో అలుగుతు నా మీద భారం వేసి పోయిండు. అట్ల వాళ్ల పెండ్లయిపోయింది.

‘‘పద్మ ఉన్నవా?’’ బయటి నుండి ఎవరో పిలవటంతో ముందు గదిలకు పోయింది పద్మ.

‘‘అన్నా ఈడ కూర్చుంటే ఎవరో ఒకరొస్తుంటరుగాని, ఎన్క కూర్చుందాం,’’ అంటూ కుర్చీలను, మంచాన్ని ఇంటెనుక వేపచెట్టు కిందకు మార్చిండు నరేష్.

ప్రభుత్వం కట్టించిన రెండు గదుల ఇల్లు అది. దానికి మరో రెండు గదులు కలిపి ఇంటిని మార్చుకుండు నరేష్. ఇంటెనుక మట్టి ప్రహరీగోడ ఉండేది. దాన్ని తీసేసి సిమెంటు ఇటుకలతో కట్టించాడు. ఇంటెనుక ఉన్న వేపచెట్టు గాలికి పాత జ్ఞాపకాలు ముసురుకుంటున్నాయి.

ఈ గ్రామ సమస్యలెగాదు, చుట్టుపక్కల గ్రామ సమస్యలు ఎన్నిసార్లు ఈ వేపచెట్టు కింద కూర్చుని చర్చించలేదు! ఎన్ని తీర్మానాలు జరగలేదు! ఆ మనుషులు, ఆ చర్చలు, ఆ వాతావరణము ఎటుపోయె? నాలాటోడు నిలబడలేక ఏవో కారణాలతో బయటకొచ్చిండొచ్చు...

“ఏందన్న ఆలోచనలబడ్డవు?”

“ఏంలేదు దుర్గయ్యా చెప్పు!” ఆలోచనల నుండి బయటకొస్తూ అన్నా.

“నేనో మాటడుగుతా, ఏమనుకోరుగా,” మమ్మల్ని ఉద్దేశించి అన్నడు దుర్గయ్య.

“దీంట్లేముంది, ఏదో కొత్తోని లెక్కడుగుతున్నవు!” నరేష్.

దుర్గయ్య ముందు రూంలకు పోయి చూసొచ్చిండు. పద్మ లేనట్టుంది.

“కాదన్న, చెల్లె అంతగనం బాధపడుతున్నదిగాని దళితులు కనీసం పైకుల పోళ్ల పక్కనన్న ఆడుతున్నరు మనూర్ల. మా వడ్డెరోళ్లకు పండుగే లేదు. మాకెంత బాదుండాలి,” దుర్గయ్య మాటలతో నిశ్శబ్దంగా మారినట్లయింది వాతావరణం.

నరేష్ ప్రశ్నార్థకంగా నా ముఖంలోకి చూసిండు. వెంటనె ఏం జవాబు చెప్పాలో అర్థంకాలేదు. కాస్త తేరుకొని అన్న.

“కాదు దుర్గయ్య, మీ కులపోళ్లకు చెరువుతో సంబంధం లేదుగా, అందుకే పండుగ లేనట్టుంది మీకు...”

“సరే అన్న మా కులపోళ్లకు చెరువుతో సంబంధం లేదు. గా కోమటోళ్లు, బాపనోళ్లు, సాలోళ్లు, హంసలోళ్లు, వడ్లోల్లకు చెరువుతో సంబంధముందా? వ్యవ సాయం చేస్తుంద్రా వాళ్లు? వాళ్లకుండి, మాకెందుకు లేకుండ పోయింది?” వాదనకు దిగిండు దుర్గయ్య.

ఇట్ల దుర్గయ్యతో వాదనకు దిగుడంటె ఇష్టం నాకు. నాకు తెలియని సంగతులు, సామెతలు ఎన్ని చెబుతడో!

మొదట్లో బతుకమ్మను అన్ని కులపోల్లు కలిసి చేసుకుంటరని అనుకునేటోన్ని. ఉద్యమంలోకి పోయాకగాని అర్థంగాలే. ఇది కొందరికె పరిమితమైన పండగని. దీంట్లో ఇన్ని తేడాలున్నయని.

ఓ ఊర్ల ఇరవై ఏండ్ల కింద జరిగిన సంఘటన ఇప్పటికి కండ్లల్ల మెదుల్తనె ఉంటది. ఉద్యమావసరాల రీత్యా ఆ ఊర్ల రెండు మూడు రోజులు ఉండాల్సి వచ్చిందప్పుడు. ఆ ఊర్ల ఒక ఆర్‌యంపి డాక్టరు చాలాకాలం నుండి వైద్యం చేస్తుండు. ప్రజల్లో మంచి పేరుంది. ఆరోజు సజ్జల బతుకమ్మ. ఆ డాక్టరు భార్య ఇంటి పక్కన ఉండె కాపోళ్లు, కురుమోళ్లు, గొల్లోళ్లతో బతుకమ్మ ఆడింది. దసరా పండుగ తెల్లారి పెద్ద గొడవ. ఎవరు చెప్పారో, ఎట్ల తెలిసిందోగాని ఆ డాక్టరు దళితుడని తెలిసిపో యింది. ఊర్లున్న బిసి, అగ్రకులపోళ్లు ఏకమై డాక్టర్ హాస్పిటల్ మీద, ఇంటి మీద దాడి చేసినరు. ఇంట్లున్న సామానులన్ని బయటపడేసి ఊరి నుండి వెళ్లగొట్టినరు. కండ్ల ముందు జరిగిన విషాదం, కదిపేసినట్లయింది నన్ను.

“గింత ఘోరమా? అయినా అన్ని కులపోళ్లు కలిసి చేసుకునే పండుగేగా?” తోటి కామ్రేడ్స్‌తో అన్న ఆవేదనతో.

“ఈ పండుగ గురించి పూర్తిగా తెల్వనట్లుంది అన్నకు,” ఓ దళిత కామ్రేడ్ అన్నడో లేదో-

“ఎట్ల తెలుస్తది. ఈ ప్రాంతపోడు గాదాయె. ఈ మతం గాదాయె. ఎట్లర్థమవు తయి ఈడి కట్టుబాట్లు!” మరోకామ్రేడ్ అన్నడు.

వీళ్లు అన్నదాంట్ల వాస్తవముంది. తాను పుట్టింది ఈ ప్రాంతంలోనైన, తన తల్లిదండ్రులు వేరే ప్రాంతం నుండి వచ్చి స్థిరపడినోళ్లు. దానికితోడు పదో తరగతి వరకు బయట ప్రపంచం తెలియకుండ మిషనరీ స్కూళ్ల, చర్చి విశ్వాసాలతో పెరిగి నోన్ని. ఉద్యమ పరిచయం ఆ జ్ఞాపకాల్లోంచి బయటికి లాగుతూ... మరో ప్రపంచం లోకి తీసుకెళ్లింది నన్ను.

“కాదన్న, ఈ పండుగను ప్రకృతి పండగని, పూలపండుగని అంటున్నరు గదా. పొద్దున లేస్తే పుట్టలు, చెట్ల గట్ల మీదుండె మాలాంటోళ్లకు ఎట్ల లేకుండాపోయె?” అమాయకంగా అడిగి నా మెదడుకు పనిపెట్టిండు దుర్గయ్య.

పొద్దున లేస్తే బతుకు కోసం వెతుకులాడే అట్టడుగు సంచార జాతులకు పండుగల గురించి పట్టించుకొనె తీరికెక్కడిది? కడుపు నిండితె అదే పండుగ. దుర్గయ్యతో అదే అంటే ఒప్పుకోడు. “మేము సంచార జాతులమా ఇప్పుడు?” అని వాదనకు దిగుతడు. పోనీ వాళ్లను... స్థిరపడిన కొన్ని కులాలకు కూడా ఈ పండుగ లేదు. ఆ కులాల పెద్దోళ్లనడిగితే ఒకే కథను ఒక్కో ప్రాంతంలో ఒక్కో తీరుగా చెప్పెటోళ్లు.

“ఎన్కట ఎప్పుడో జరిగిందంట. మా కులంది ఒకామె పనికిపోయి పొద్దంత పనిచేసి చీకటి పడేటప్పుడు ఇంటికి చేరుకుంది. పండుగుందని గుర్తొచ్చి గబగబా తానం చేసి ఇంటి పక్కనున్న తంగేడు, గుమ్మడిపూలు తెంపి బతుకమ్మను పేర్చ బోయింది. బతుకమ్మను పేర్చేటందుకు ఇంట్ల ఎంతెతికిన కనీసం శిబ్బిగూడ కనపడ లేదు. ఏంచేయాలో అర్థంగాలా. ఇంటెనుక ఆవు పుర్రె కనిపిస్తే సంతోషంతో దాన్ని తెచ్చి బతుకమ్మను పేర్చింది దాంట్ల. తర్వాత దాన్ని తీసుకుని చెరువు దగ్గరకు బయలుదేరింది. ఎట్ల కనిపెట్టినరో ఏమోగాని, వాసన కనిపెట్టినరు పై కులపోళ్లు. ఆవు పుర్రెల బతుకమ్మను పెట్టి తెచ్చినవు కనుక ఇప్పటిసంది మీకు బతుకమ్మ ఉండదని కట్టడి జేసింద్రంట,” అని ఒక ముసలామె చెప్పింది ఊర్ల.

మరో దగ్గర, "పొద్దంత పనికి పోయొచ్చిన మా గూడెపామె అట్లనో ఇట్లనో బతుకమ్మను పేర్చిందిగాని, వాయినానికి ఎంత ఎతికిన గింత పిండి దొరకలె. ఏం చేయాలో అర్థంగాక కింద మీదు అవుతుండగా, దండెమ్మీది తునకలు గుర్తొచ్చి, గబగబా వాటిని కాల్చుకొని బయలుదేరింది. దారిల కాకులు వాసనపట్టి ముక్కలతో పాటు బతుకమ్మను తన్నుకుపోయినయి. గప్పటి సంది పెద్ద కులపోళ్లు మా కుల పోళ్లకు బతుకమ్మ లేదని తీర్మానం చేసిండ్రంట," కుల పెద్దాయన చెప్పిండు.

ఇంకో దగ్గర, "అప్పుడెపుడో ఊర్ల పెద్ద కరువొచ్చిందంట. ఆ కరువుల పై కులపోళ్లు ఏమోగాని, మా జాతోళ్లు తిండిలేక మలమలలాడినరు. ఎంత హీనమంటే తినడానికి గింత తవుడు గూడ లేకుండ ఉండె. గటువంటి కష్టంలో మా జాతోళ్లు బతుకమ్మ తబుకును అమ్ముకున్నరు. అగో గప్పటిసంది మాకు బతుకమ్మ లేకుండా పోయిందని మా పెద్దోళ్లు చెబుతరు మాకు," అని ఆ ఊర్ల చెప్పినరు.

ఇట్ల అనేక జానపద కథలు పుట్టుకొచ్చినయి. శ్రామికులు బతుకమ్మకు ఎట్ల దూరమయ్యారనే ప్రశ్నకు మాత్రం నాకు జవాబు దొరకలా.

"ఎల్లమ్మ గుర్తుందాన్న? అచ్చం పద్మలాగే పాటలు పాడేది!" అన్నడు నరేష్.

"ఎందుకు లేదు!" పదిహేనేండ్ల కింది విషయం గుర్తుకు తెచ్చుకుంటా అన్న.

"మీ పాలామేగా?" అన్నడు దుర్గయ్య.

"అవును. అప్పట్లోనే ఎల్లమ్మ పాటలు పాడుతుంటే సూదరోళ్లు, పై కుల పోళ్లు బతుకమ్మ ఆడెటోళ్లు..." మరిచిపోయిన ఎల్లమ్మను తిరిగి జ్ఞాపకాల్లోకి తీసుకొచ్చిండు నరేష్.

ఎల్లమ్మ గురించి విన్నదెగాని ప్రత్యక్షంగా చూసింది లేదు. ఆమె అద్భుతమైన గొంతు క్యాసెట్ల ద్వారా విన్నదే. ఆమె పాటలు వింటుంటే బెల్లి లలిత గుర్తుకు రావల్సిందె. బతికుండగా ఆమెను ఎందుకు చూడలేకపోయానన్న బాధ ఇప్పటికీ వేధిస్తుంటది. ఎల్లమ్మ గురించి తెలుసుకునే ముందు ఆమె వూరు గురించి తెలుసుకోవాలి. తెలంగాణలోనె ఆ ఊరుకు ఓ ప్రత్యేకతుంది. తెలంగాణ సాయుధ పోరాటం నుండి ఇప్పటి పోరాటాల వరకు ఉద్యమకారులకు జీవం పోసిన ఊరది. ఊరి బయట విసిరి వేయబడెటట్లుండె దళితవాడలు కాలక్రమంలో ఊరి మధ్యకైనయి. దళితుల ఇండ్ల పక్కనె బిసి, ఉన్నత కులాల ఇండ్లు కలగలిసిపోయినట్లయి నయి. ఎల్లమ్మ పాటలు పాడుతుంటె బిసి, ఉన్నత కులాల స్త్రీలు బతుకమ్మ ఆడేది. చిత్రమైన విషయం ఏమిటంటే దళితులు, బిసిలు, పై కులపోళ్లు ఊరి మధ్యలో ఆడటం!

ఈ మార్పుకు ఓ కారణముంది.

ఆ ఊర్లనే సాతాను శేషయ్యపంతులనె పెద్దాయనుండేటోడు. తెలంగాణ సాయుధ పోరాటకాలంలో కొరియర్‌గా పనిచేసిండని చెప్పుకుంటరు. పెండ్లి చేసుకోలె. ఎల్లమ్మతో స్నేహంగా ఉండేవాడని అనుకుంటరు.

తమ వాడల్లో బతుకమ్మ ఆడుకునే దళితులను డప్పులు కొట్టించుకుంటూ ఊరేగింపుగా ఊరి మధ్యకు తీసుకొచ్చెటోడు శేషయ్య పంతులు.

కొంతమంది పెత్తందార్లకిది ఇష్టం లేకుండె. కోపంతో అడ్డుకోటానికి ప్రయత్నం చేశారు. కానీ, ఆ ప్రాంతమంత ఎన్‌కౌంటర్లతో, దాడులతో దద్దరిల్లుతున్న కాలమది. పైగా నక్సలైట్లు వాళ్ల వాడల్లోనె ఉంటారనె ప్రచారమొకటి. ఆ భయంతోనె గొడవలెందుకని ఊరకుండిపోయారు పెత్తందార్లు. అట్ల ఊరి మధ్యలో పై కులపోళ్ల పక్కనే ఆడటం తెలంగాణలో ఒక అరుదైన దృశ్యం!

అప్పట్లోనే ఎల్లమ్మలాంటి ఓ దళిత స్త్రీ మధ్యల నిలబడి పాటలు పాడు తుంటె, పై కులపోళ్లు బతుకమ్మ ఆడినరు. అటువంటిది, కాలం ఇంత మారాక కూడా పద్మలాంటివాళ్లను కనీసం బిసి కులాలు ఎందుకు తమతో కలుపుకోని స్థితిల ఉన్నరు? ఈ సమస్య ఎట్ల పరిష్కారం కావాలి? ఎవరాలోచనల్లో వాళ్లుండగానే హఠాత్తుగా గౌస్‌మియా వచ్చిండు. అతన్ని చూడగానే,

“నీ కోసమే ఎదురుచూస్తున్న. పెద్దకూరతో బిర్యాని చేయాలి మనము,” అన్నడు దుర్గయ్య.

“బిర్యాని సంగతి తర్వాతగాని, నిన్న మా పెద్దమ్మ ఊర్ల జరిగిన విషయం పేపర్ల వచ్చిందన్నా,” ఆ దగ్గరున్న దినపత్రికను చూస్తూ అండు గౌస్.

“ఏ విషయము?” అడిగిన.

“నిన్న యాదగిరిగుట్టకు పోతిగా. వస్తూ వస్తూ దార్ల మా పెద్దమ్మింటికి పోయిన పనుందని. పెద్ద గొడవయింది. ఊర్ల పండగ గురించి...”

“ఏం గొడవ?” ఆత్రంగ అడిగాడు నరేష్.

“నిన్న సజ్జల బతుకమ్మగా! మాలమాదిగలు తెలంగాణొచ్చిన సంబురంతో ఎప్పుడూ లేంది వాళ్ల వాడల నుండి గ్రామ పంచాయితి దగ్గరకొచ్చినరు బతుకమ్మను ఆడెటందుకు. ఈడ ఆడొద్దని పై కులపోళ్లు అడ్డువడ్డరు. మీతో ఆడం పక్కనే ఆడు కుంటమని దళితులు బతిమిలాడుకున్నరు. పై కులపోళ్లు ఒప్పుకోలే. మీరొచ్చి ఈడ ఆడితే మా బతుకమ్మ మైలపడుతదని బండబూతులు తిట్టినరు. కోపమొచ్చి బతుకమ్మలను చెర్ల వేయకుండా ఆడనే కూర్చున్నరు దళిత స్త్రీలు. పోలీసులకు

ఎట్ల తెలిసిందోగాని ఊర్లకు వచ్చి, దళితులకు సర్దిచెప్పి బతుకమ్మలను చెర్ల ఏపించినరు.''

దుర్గయ్య, నరేష్, నేను ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నం. పద్మకు జరిగిన అవమానం గౌస్‌కు ఇంకా తెలియనట్టుంది.

''...ఈ నా కొడుకులకు బలుపెక్కింది. ఎవరిని లెక్క చేయకుండవుతున్నరు. వాళ్లను ఊర్ల పనులకు ఎవరు పిలవొద్దు. కూలీలుగా పెట్టుకోవద్దు. భూములు కౌలుకియ్యొద్దు,'' దళితులకు వ్యతిరేకంగా పై కులపోళ్లు చేసుకున్న తీర్మానాలను చెప్పుకుపోతుండు గౌస్.

''గింత అన్యాయమా? మనూర్లెనె నయమున్నట్టుంది. బతుకమ్మలను వాళ్లేమన్న బంగారంతో చేసింర్రా, మనం చేసినట్లే పూలతో చేస్తిరి. మనది అంటరానిదెట్లయ్యె, వాళ్లది బంగారు బతుకమ్మ ఎట్లయ్యె? గిప్పటి సంది ప్రదర్శనలకు రమ్మని ఎవడన్నొచ్చి అడిగితే చెబుత వాళ్ల సంగతి...'' మా దగ్గరకు ఎప్పుడొచ్చిందోగాని కోపంగా అన్నది పద్మ.

''గదే మాటమీదుండు!'' వెంటనే అందుకొని సంతోషంగా నావైపు చూస్తూ అన్నడు నరేష్.

*మొగిలికి కృతజ్ఞతలతో...*

*ఆదివారం ఆంధ్రజ్యోతి*
*18 అక్టోబర్ 2015*

✻




పి. చిన్నయ్య 10 అక్టోబర్ 1965న నల్గొండ జిల్లాలో జన్మించారు. వీరి మొదటి కథ *బండ పగిలింది* ఫిబ్రవరి 1996లో మన సమాజం పత్రికలో అచ్చయ్యింది. ఒక కథాసంపుటాన్ని ప్రచురించారు. ముప్పైకి పైగా కథలు రాశారు.

*చిరునామా:* **మోటకొండూరు పోస్ట్, యాదగిరిగుట్ట మండల్, నల్గొండ జిల్లా - 508 286 ఫోన్: 95533 58569**